రతన్ టాటా మృతికి ప్రముఖుల సంతాపం

చెన్నై, న్యూస్‌టుడే: భారత వ్యాపార దిగ్గజం రతన్ టాటా మృతికి పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. గవర్నరు ఆర్.ఎన్.రవి తన 'ఎక్స్' పేజీలో.. ఉత్తమ జాతీయవాది, మానవతావాది, అసమాన పారిశ్రామికవేత్త, రతన్ టాటా మృతి తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. ముఖ్యమంత్రి తన 'ఎక్స్' పేజీలో.. భారతీయ పారిశ్రామికరంగానికి నిజమైన దీపస్తంభంగా ఆయన విరాజిల్లారని పేర్కొన్నారు. ఆయన దార్శనికత, నాయకత్వం టాటా గ్రూపును డిజైన్ చేయడంతోపాటు ధార్మిక వాణిజ్య విధానాలకు అంతర్జాతీయ కొలమానంగా మారిందన్నారు. దేశాన్ని నిర్మించడం, ఆవిష్కరణలు, పరోపకారం వంటివాటిలో ఆయన నిరంతర అంకితభావం లక్షలాది మందిపై చెరగని ముద్ర వేసిందని తెలిపారు. ఇండియా ఓ బ్రహ్మాండమైన దక్షతను కోల్పోయిందని, ఆయన వారసత్వం తరాలకు ప్రేరణ ఇస్తుందని పేర్కొన్నారు. ఆయన్ను కోల్పోయిన ఈ తరుణంలో ఆయన కుటుంబ సభ్యులకు, సహోద్యోగులకు, టాటా గ్రూపునకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మక్కళ్ నీది మయ్యం అధ్యక్షుడు, నటుడు కమల్‌హాసన్ తన 'ఎక్స్' పేజీలో దేశ నిర్మాణంలో భాగస్వామ్యం వహించిన ఆధునిక భారతదేశ నిధి రతన్ టాటా అని అన్నారు. ఆయన నిజమైన సంపద వస్తువుల్లో లేదని నీతి, దేశభక్తి, ధార్మిక విధానంలో ఉందని తెలిపారు. ■ సూపర్‌స్టార్ రజనీకాంత్ తన 'ఎక్స్' పేజీలో.. ప్రపంచపటంలో భారత్‌ను తన దార్శనికతతో, ఆసక్తితో స్థానం పొందేలా చేసిన వ్యక్తి రతన్‌టాటా అన్నారు. వేలాది మంది పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించారని, పలు తరాలుగా లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు సృష్టించారని తెలిపారు. ఇంతటి మహోన్నతమైన వ్యక్తితో గడిపిన క్షణాలను సదా స్మరిస్తానని పేర్కొన్నారు. భారతదేశ నిజమైన పుత్రుడు ఇక లేరన్నారు.



సైదాపేట: దేశానికి, ప్రజలకు రతన్ టాటా చేసిన కృషి ఎనలేనిదని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. పారిశ్రామిక రంగానికి తీరని లోటని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ తెలిపారు. ఆయన ఎప్పటికీ చరిత్రలో నిలిచిపోతారని పీఎంకే వ్యవస్థాపకుడు రామదాస్ పేర్కొన్నారు.

- నగరంలో ఏళ్లుగా వికృత సంస్కృతి
- గ్యాంగ్‌లుగా విడిపోయి రక్తపాతాలు
- పోలీసులకు, ప్రభుత్వానికి సవాల్‌గా మారుతున్న వైనం

మాయని మచ్చ.. రూట్ తల

రూట్ తల.. అంటే, దారి నేత అని అర్థం.

ఈ నేత చెప్పినట్లే విద్యార్థులు నడుచుకోవాలి. ఒక కాలేజీ, మరో కళాశాలకు జరిగే గొడవలన్నీ ఇలా వస్తున్నవే. వారి వికృత చేష్టలతో కాలేజీలు, తల్లిదండ్రులకు, వ్యవస్థలకు చెడ్డపేరు వస్తోందని బహిరంగంగా విమర్శించే పరిస్థితి దాపురించింది. నగరానికి ఈ సంస్కృతి మాయని మచ్చగా మారింది.

ఈనాడు-చెన్నై



నగరంలోని ప్రెసిడెన్సీ కాలేజీకి చెందిన 18ఏళ్ల సుందర్ 'రూట్ తల' వివాదంలో ఈనెల 8న హత్యకు గురయ్యాడు. పచ్చయప్పన్ విద్యార్థులు కాపుకాచి అతడ్ని హతమార్చారు. కేసు నమోదవగా హత్యకు కారణమైన ఐదుగురు విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 4వ తేదీ నుంచి ఈ రెండు కళాశాలల విద్యార్థి బృందాల మధ్య 'రూట్ తల'పై వివాదం నడుస్తోంది. ఈ ఘటన నగరాన్ని ఉలిక్కిపడేలా చేసింది.



బస్సు పైకెక్కి విద్యార్థుల హంగామా

ఆ మార్గంలో అతనే హీరో..

'రూట్ తల' విషయమై చెన్నైలో విద్యార్థుల మధ్య నడుస్తున్న వివాదాలు, గొడవలు ఇతర రాష్ట్రాల్ని సైతం విస్మయానికి గురిచేస్తున్నాయి. అసలు 'రూట్ తల' అంటే ఏంటనేది ఇప్పుడు వారిలో చర్చనీయాంశమైంది. ఆన్‌లైన్‌లో సైతం బాగా వెదుకుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో చెన్నైలోని ఘటనలపై ఏకంగా చర్చలు నడుస్తున్నాయి. 'రూట్ తల' అనేది కొన్నేళ్లుగా విద్యార్థుల్లో సంస్కృతిగా వస్తోంది. వారు వెళ్లే రైలు, బస్సు రూట్లలో ఒక విద్యార్థిని నేతగా ఎంచుకుంటారు. అతన్నే ఆ రూట్‌లో హీరోగా భావిస్తుంటారు. ఇది నగరంలో ప్రధానంగా పచ్చయప్పన్ కాలేజీ, ప్రెసిడెన్సీ కాలేజీ, నందనం ఆర్ట్స్ కాలేజీ తదితర విద్యార్థుల్లో ఈ పద్ధతులు నడుస్తున్నాయి. తాము వెళ్లే రూట్‌లలో ఆధిపత్యం కోసం ఈ విద్యార్థులు వివాదాల జోలికి వెళ్తున్నట్లు పోలీసులు వెల్లడిస్తున్నారు. ఎంతటి వివాదాలనైనా ఎదుర్కోగలిగే వారు, పలుకుబడి ఉన్న విద్యార్థులు మాత్రమే 'రూట్ తల'గా మారుతూ వస్తున్నారు. వారి నాయకత్వంలో తిరిగే విద్యార్థుల్లో 90శాతం మంది పేద కుటుంబాలకు చెందినవారేనని పోలీసులు వివరిస్తున్నారు.

ప్రత్యేక గ్రూప్‌లు

సామాజిక మాధ్యమాల్లో రూట్ తల పేరుతో ప్రత్యేక విద్యార్థి బృందాలే ఉన్నాయి. ప్రత్యేక ఖాతాలతో పాపులర్ అవుతున్నారు. సబర్బన్ రైళ్లు, ఎంటీసీ బస్సు రూట్ల వారీగా ఈ ఖాతాల్ని నడుపుతుండటంతో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కొన్ని ఖాతాలు బ్లాక్ చేసినట్లు వెల్లడిస్తున్నారు. బస్సు రూట్లలో చూస్తే.. 6డీ, 29ఏ, 25జీ, 57ఎఫ్, 15బీ రూట్లలో 'రూట్ తల' విద్యార్థి బృందాలున్నాయి.

వివాదాలకు అడ్డాలు

ప్రత్యర్థి కాలేజీల విద్యార్థులు ఆయా రూట్లలో కనిపిస్తే.. ఐడీ కార్డులు పరిశీలించి మరీ గొడవలకు దిగుతుంటారు. వారి వెనక రాజకీయ నేతలుండటంతో ఆగడాలకు అడ్డు అదుపులేకుండా పోతోందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. నగరంలో పెరంబూర్ డిపో, తిరువొత్తియూర్ టోల్‌గేట్, సెంట్రల్ రైల్వేస్టేషన్, పూందమల్లి హైరోడ్ తదితర ప్రాంతాల్లో ఆయా కాలేజీల విద్యార్థులు తరచుగా గొడవలకు దిగుతుంటారు.

తరచూ ఘటనలు

ఈ ఏడాది నగరంలో విద్యార్థి బృందాల మధ్య పలు ఘటనలు చోటుచేసుకున్నాయి. కేసులూ నమోదయ్యాయి. ఫిబ్రవరి 28న విద్యార్థుల్ని గాయపరిచిన కేసులో ముగ్గుర్ని అరెస్టు చేశారు. ఆగస్టు 3న సైదాపేట రైల్వేస్టేషన్‌లోనే గొడవకు దిగారు. రాళ్లతో కొట్టుకున్నారు. ఇదేనెల 24న చెన్నై సెంట్రల్-సూళ్లూరుపేట రూట్‌లో ఆయుధాలతో తిరుగుతున్న రూట్‌తల విద్యార్థుల్ని రైల్వేపోలీసులు అరెస్టు చేశారు. గతనెల 20న బీచ్‌రోడ్డులో ఆయుధాలతో తిరుగుతూ వివాదాస్పదంగా ఉన్న ఐదుగురు విద్యార్థుల్ని పోలీసులు అరెస్టు చేశారు.

మార్పు రావడంలేదు

దశాబ్దం కిందట పరిస్థితి చూస్తే.. అప్పట్లో పోలీసులు విద్యార్థి బృందాల్ని హెచ్చరించి వదిలేసేవారు. విద్యార్థులు మారకపోగా రానురానూ ఈ సంస్కృతి చెన్నైలో తీవ్ర వివాదాస్పదమైంది. పోలీసులు కఠినంగా వ్యవహరించడం మొదలుపెడుతున్నారు. ఇప్పటికే నగరంలో చాలామంది విద్యార్థులపై కేసులు నమోదయ్యాయి. వారి వివాదాలకు సీసీటీవీ ఫుటేజీ, మొబైల్ వీడియోల్ని పోలీసులు ఆధారాలుగా చేసుకుంటున్నారు.



రైల్వేస్టేషన్లో గొడవ పడుతూ..(పాతచిత్రం)

పరిష్కారం కావాలి

కాలేజీల్లో విద్యార్థి వ్యవస్థల్లో ప్రక్షాళన రావాలని నేర విశ్లేషకులు భావిస్తున్నారు. క్యాంపస్‌ల్లో గ్యాంగులుగా విడిపోయి విద్యార్థి నేతల్ని అనధికారికంగా ఎంచుకోకుండా అర్హులైన విద్యార్థుల్ని కాలేజీ ఎన్నికల్లో పాల్గొనేలా చేయాలని సూచిస్తున్నారు. ఇప్పటికే ఆయా వివాదాస్పద కాలేజీల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలు జరగడంలేదని చెబుతున్నారు. ప్రభుత్వం సైతం ప్రత్యేక శ్రద్ధ చూపి ఆయా కాలేజీల్లో విద్యార్థులను సరైన దారిలో నడిపించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందని అభిప్రాయపడుతున్నారు.

సినిమాల ప్రభావం..

నగరంలో 'రూట్ తల' విద్యార్థుల మధ్య చెలరేగుతున్న ఎన్నో గొడవలు నగరంలో ఆందోళనల్ని సృష్టిస్తున్నాయి. వారిపై సినిమా ప్రభావం బాగా ఎక్కువ. ప్రముఖ వెటరన్ హీరో 1980లో నటించిన ఓ సినిమాలోని పాటను ఈ విద్యార్థిబృందాలు తరచూ పాడుతుంటారు. ప్రధానంగా ప్రెసిడెన్సీ కాలేజీకి చెందిన విద్యార్థులు చెన్నై సెంట్రల్-తిరుత్తణి మధ్య సబర్బన్ రైళ్లలో ఈ పాటతోనే వీరవిహారం చేస్తుంటారు. రూట్ తల సంస్కృతి కూడా 1980ల్లోనే ప్రారంభమైనట్లు పోలీసులు చెబుతున్నారు.

పోలీసుల వైఫల్యమేనా?

'రూట్ తల' వివాదాలపై దృష్టి పెట్టేందుకు నగర పోలీసులు ప్రత్యేక నిఘా బృందాల్నే ఏర్పాటుచేశారు. వారు ఆయా రూట్లలో రైల్వే, బస్సు సిబ్బందితో స్థానికులతో మాట్లాడి విద్యార్థుల్ని మార్చాలని చూస్తున్నారు. గొడవలు, కేసులు మాత్రం ఆగడంలేదు. కాలేజీ యజమాన్యాలు, పోలీసులు, విద్యార్థుల తల్లిదండ్రులు సరైన శ్రద్ధ పెట్టకపోవడంతోనే సమస్యలొస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

ఆరు రోజులపాటు వర్షాలకు అవకాశం

ప్యారిస్: రాష్ట్రంలో ఆరు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో మరికొన్ని రోజుల్లో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించడానికి ఆస్కారం ఉందని పేర్కొంది. రానున్న ఆరురోజుల్లో సేలం, కృష్ణగిరి, ధర్మపురి, తిరుపత్తూర్, నామక్కల్, కరూర్, తిరుచ్చి, మదురై, విరుదునగర్, దిండుక్కల్, తేని, రామనాథపురం జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. సముద్రతీర ప్రాంతాల్లో గంటకు 35-45 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, మధ్యలో 55 కి.మీ వేగానికి చేరుతాయని జాలర్లకు హెచ్చరికలు జారీచేసింది. గురువారం తెల్లవారుజామున చెన్నైలోని ఎగ్మూర్, పెరంబూర్, వ్యాసర్పాడి, మాధవరం, కోయంబేడు, కోడంబాక్కం, వడపళని, సైదాపేట మొదలైన ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది.

పారిశుద్ధ్య పనుల్లో రోబో

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరి రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసూతి శస్త్రచికిత్స థియేటర్, డెలివరీ వార్డులకు కేంద్రప్రభుత్వం లక్ష్య నేషనల్ సర్టిఫికేట్ ప్రదానం చేసింది. నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు కూడా ఎంట్రీ లెవల్ సర్టిఫికేట్ జారీ చేసింది. ఇది తమిళనాడు, పుదుచ్చేరిలో తొలిసారిగా ఈ ఆస్పత్రికే దక్కడం విశేషం. వాటిని ముఖ్యమంత్రి రంగసామి గురువారం మెడికల్ సూపరింటెండెంట్ అయ్యప్పన్, నోడల్ అధికారి గురుప్రసాద్‌కు అందించారు. ఆస్పత్రిని శుభ్రంగా ఉంచే పని ప్రైవేట్‌కు అప్పగించగా రోబోటిక్ యంత్రాన్ని తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి రంగసామి ప్రారంభించారు. కార్యక్రమంలో స్పీకర్ సెల్వం, ఎమ్మెల్యే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీపై మానవ హక్కుల కమిషన్ ఉత్తర్వుకు స్టే

ప్యారిస్: పోలీసు సహాయ కమిషనర్ ఇళంగోవన్‌పై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ జారీ చేసిన ఉత్తర్వులకు స్టే విధిస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. తిరువొత్తియూర్ చుట్టుపక్కల ప్రాంతాల్లోని రౌడీల ఇళ్లకు ఇళంగోవన్ వెళ్లి, వారి కుటుంబాలతో ఇకపై క్రమశిక్షణతో ఉండాలని లేదంటే ఎన్‌కౌంటర్ చేసే అవకాశం ఉందంటూ మాట్లాడిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. వీడియో ఆధారంగా మానవహక్కుల కమిషన్ సుమోటోగా కేసు విచారణకు తీసుకుంది. శాంతిభద్రతల పరిరక్షణకు అనుసరించే సాధారణ పద్ధతి పాటించినట్లు ఇళంగోవన్ తరఫున తెలిపారు. పిటిషన్‌పై మానవ హక్కుల కమిషన్ జవాబివ్వాలని ఆదేశించి, విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.



ఆయుధపూజను పురస్కరించుకుని గురువారం కోయంబేడు మార్కెట్‌లో కొనుగోలుదారుల రద్దీ

నెం.14417

- ప్రత్యేక టీషర్ట్ ధరించిన అన్బిల్ మహేష్
- విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్న మంత్రి



ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు భయం కారణంగా పలు అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఆత్మహత్య చేసుకోవడం, ఇంటి నుంచి పారిపోవడం వంటివి వాటిని అడ్డుకునేందుకు, వారిలో ధైర్యం నింపి, తగిన సూచనలు ఇచ్చేందుకు 14417 అనే టోల్‌ఫ్రీ నెంబర్ పని చేస్తోంది. 2018లో తీసుకొచ్చిన ఈ నెంబర్ విద్యార్థులకు ఎంతగానో లాభదాయకంగా ఉంది. నెంబర్‌ను విద్యార్థులకు మరింత చేరువ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పసుపురంగుతో కూడిన ప్రత్యేక టీషర్ట్ ధరించారు. వెనుకభాగంలో 14417 నెంబర్ ఉంది. పాఠశాల విద్యాశాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ... విద్యార్థులకు అవసరమైన మానసిక కౌన్సిలింగ్ ఇచ్చేందుకు ప్రత్యేక నెంబర్‌తో కూడిన టీషర్ట్‌ను మంత్రి ఆరునెలలుగా ధరిస్తున్నారని చెప్పారు. మూడేళ్లుగా ఆయన 224 పాఠశాలల్లో పరిశీలన జరిపి విద్యార్థులతో మాట్లాడారని తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కొళత్తూర్‌లో పర్యటన ముగించనున్నారని చెప్పారు. ఆయన టీషర్ట్ ద్వారా చాలామంది విద్యార్థులకు నెంబర్ గుర్తుండిపోతోందన్నారు. విద్యార్థులు ఈ నెంబర్‌ను సంప్రదించడం ద్వారా కావాల్సిన సమాచారం తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

కరుణానిధి అల్లుడు మురసొలి సెల్వం మృతి

చెన్నై, న్యూస్‌టుడే: దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి అల్లుడు, రచయిత, పాత్రికేయుడు మురసొలిసెల్వం(84) గురువారం ఉదయం మృతి చెందారు. గుండెపోటు కారణంగా బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయన ప్రముఖ రాజకీయవేత్త మురసొలి మారన్‌కు తమ్ముడు. ముఖ్యమంత్రి స్టాలిన్ అక్క సెల్విక్ భర్త. డీఎంకే అధికారిక పత్రిక 'మురసొలి' దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్‌గా ఉన్నారు. మురసొలి సెల్వం మృతి వార్త తనను పిడుగుపాటుకు గురి చేసిందని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటనలో తెలిపారు. కరుణానిధి మానసపుత్రిక 'మురసొలి' బాధ్యతలను యుక్త వయసు నుంచి ఆయన తన భుజాలపై మోశారన్నారు. మురసొలి సంపాదకునిగా తన రచనలతో ప్రజాస్వామ్య గళాన్ని ప్రతిధ్వనింపజేశారని తెలిపారు. ఎన్నికల రంగం నుంచి సినిమా రంగం వరకు ఆయన తనదైన ముద్ర వేశారన్నారు. తనకు చిన్నతనం నుంచి అండగా, తన ఎదుగుదలకు తోడ్పాటుగా నిలిచారని తెలిపారు. ● పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ తన ప్రకటనలో.. డీఎంకే సిద్ధాంతాల ప్రచారంలో, హిందీ వ్యతిరేక ఉద్యమంలో మురసొలి సెల్వం పాల్గొన్నారని తెలిపారు. డీఎంకే అన్ని విభాగాలు మూడు రోజులపాటు పార్టీ పతాకాన్ని అవనతం చేయాలని కోరారు. ● 'మురసొలి'లో 50 ఏళ్లకుపైగా సెల్వం తన రచనలతో ప్రభావం తీసుకొచ్చారని,'సిలంది' అనే కలం పేరిట వ్యాసాలు రాశారని మంత్రి స్వామినాథన్ తెలిపారు. ● రాష్ట్ర హక్కులు, సమాఖ్య పాలన విధానం, రాజ్యాంగం వంటి వాటి పరిరక్షణకు, మతోన్మాదాన్ని వ్యతిరేకంగా తన రచనల ద్వారా దృఢంగా పోరాడారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ పేర్కొన్నారు. సౌమ్యుడు, మృదుభాషి, మితభాషి అని తెలిపారు. ● మురసొలి సెల్వం తన చిరకాల మిత్రుడు, అద్భుతమైన వ్యక్తి అని నటుడు సూపర్‌స్టార్ రజనీకాంత్ తన 'ఎక్స్' పేజీలో పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



మురసొలి సెల్వం భౌతికకాయం వద్ద విలపిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి. చిత్రంలో మంత్రి పీకే శేఖర్‌బాబు, ఎంపీ దయానిధి మారన్



గోపాలపురంలోని కరుణానిధి నివాసం వద్ద పార్టీ శ్రేణులు



టీఆర్ బాలు, గేయ రచయిత వైరముత్తు..

నీట్ రద్దు ఏమైంది?

సేలం, న్యూస్‌టుడే: నీట్ పరీక్ష రద్దుకు డీఎంకే ప్రభుత్వం చేసిందేమీ లేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. నీట్‌లో ఉత్తీర్ణత సాధించలేదని మనస్తాపంతో ఇటీవల సేలం జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని పునిత చిత్రపటానికి గురువారం అంజలి ఘటించారు. ఆమె కుటుంబీకులను ఓదార్చారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే నీట్ రద్దు చేయిస్తామంటూ విర్రవీగిన డీఎంకే ఇప్పటివరకు ఏం సాధించిందని ప్రశ్నించారు. తమిళనాట కోటి సంతకాలు తీసుకున్నారని, వాటితో ఒరిగిందేమీ లేదన్నారు. డీఎంకే మాయమాటలను ప్రజలు అర్థం చేసుకుంటున్నారన్నారు. 40 లోక్‌సభ సీట్లు గెలుచుకున్న డీఎంకే లోక్‌సభలో ఒత్తిడి తెస్తే తప్పక ఈ వ్యవహారంలో విజయం సాధించవచ్చని చెప్పారు.



పునిత చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న పళనిస్వామి

'స్వచ్ఛ' జాబితాలోకి చెన్నైను తీసుకురండి

సైదాపేట: స్వచ్ఛ నగరాల జాబితాలోకి చెన్నైను మళ్లీ తీసుకురావాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిసామి డిమాండ్ చేశారు. అన్నాడీఎంకే హయాంలో 45, 43వ స్థానంలో ఉన్న చెన్నై కార్పొరేషన్ ప్రస్తుతం 199కు పడిపోయిందని ప్రకటనలో పేర్కొన్నారు. డీఎంకే 41 నెలల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ వెనుకబడిందని ఆరోపించారు.



సౌత్ మద్రాస్ కల్చరల్ అసోసియేషన్ (ఎస్ఎంసీఏ), ఎస్ఎంసీఏ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈసీఆర్‌లోని కైలాష్ కన్వెన్షన్‌లో జరిగిన 'శారదోత్సవ్-24' కార్యక్రమంలో గవర్నర్ ఆర్.ఎన్.రవి ముఖ్యఅతిథిగా పాల్గొని తిలకిస్తున్న దృశ్యం

- న్యూస్‌టుడే, చెన్నై

టీఎన్‌పీఎస్సీ వార్షిక టైమ్‌టేబుల్ విడుదల

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: వచ్చే ఏడాదికిగాను ప్రభుత్వ పోటీ పరీక్షల వార్షిక టైమ్‌టేబుల్‌ని టీఎన్‌పీఎస్సీ గురువారం విడుదల చేసింది. అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలు అందుబాటులో ఉన్నాయి. ఒక ఏడాదిలో ఏయే పోస్టులకు ఎప్పుడెప్పుడు పరీక్షలు జరుగుతాయనే వివరాలతో కూడిన జాబితాను వెబ్‌సైట్‌లో గురువారం ఉంచింది. అందులో గ్రూప్-1, 2, 2ఏ, 4, ఇంటిగ్రేటెడ్ టెక్నికల్ వర్క్స్ పరీక్షతోపాటు మొత్తం ఏడు రకాల ప్రకటనలు ఉన్నాయి. ఖాళీల వివరాలను నోటిఫికేషన్ విడుదల చేసినప్పుడు తెలియజేయనున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి బోనస్

చెన్నై, న్యూస్‌టుడే: ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే 'సి', 'డి' ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి బోనస్, ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. లాభాలు గడించే ప్రభుత్వ రంగ సంస్థలు, విద్యుత్ శాఖలో పనిచేసే 'సి', 'డి' ఉద్యోగులకు 8.33 శాతం బోనస్, 11.67 శాతం ఎక్స్‌గ్రేషియా, గృహ నిర్మాణ బోర్డులో 'సి', 'డి' ఉద్యోగులకు 8.33 శాతం బోనస్, 1.67 శాతం ఎక్స్‌గ్రేషియా అందించనున్నారు. తమిళనాడు మెట్రోవాటర్ బోర్డులో పని చేసే అర్హులైన 'సి', 'డి' ఉద్యోగులకు 8.33 శాతం బోనస్, తమిళనాడు సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసే కార్మికులకు రూ. 3వేలు ఎక్స్‌గ్రేషియా అందించనున్నారు. అర్హులైన పర్మనెంట్ ఉద్యోగులకు కనిష్ఠంగా రూ.8,400 నుంచి గరిష్ఠంగా రూ.16,800 పొందనున్నారు. మొత్తం 2,75,670 మంది కార్మికులు రూ.369.65 కోట్ల బోనస్, ఎక్స్‌గ్రేషియా అందుకోనున్నారు.



సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'వేట్టైయన్' గురువారం విడుదలైంది. ఎగ్మూరు ఆల్బర్ట్ థియేటర్ వద్ద కటౌట్‌కు పాలాభిషేకం చేస్తున్న అభిమానులు, బాణసంచా కాల్చుతూ..

తెలియని నెంబర్లతో జాగ్రత్త!

ప్యారిస్, న్యూస్‌టుడే: ఇటీవలి కాలంలో ఆన్‌లైన్ మోసాలు పెచ్చుమీరుతున్నాయి. ముంబయి పోలీసులమని, మీ పేరుపై మత్తుపదార్థాల పార్సిల్ వచ్చిందని, మీ బ్యాంకు ఖాతా నుంచి చట్టవిరుద్ధంగా నగదు లావాదేవీలు జరిగాయని, మీ బ్యాంకు ఖాతాలో నగదు మాయం చేసే ఘటనలు కోకొల్లలు. అలాగే బ్యాంకు అధికారినంటూ కాల్ చేసి మోసాలకు తెగబడుతున్నారు. కొందరు ఈ తరహా మోసాలను గ్రహించి వెంటనే ఫోన్ కట్ చేస్తున్నారు. అయినా తమిళనాడు సహా దేశవ్యాప్తంగా ఇలాంటి ముఠాలు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతూనే ఉన్నాయి. చెన్నై తదితర దేశంలోని ప్రధాన నగరాల్లో నివసిస్తున్నవారే ఇలాంటి మోసాలకు ఎక్కువగా గురవుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు దేశవ్యాప్తంగా రూ.1750 కోట్ల మేర పలు విధాలుగా దోచుకున్నారు. ఈ మోసాలను అడ్డుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు చర్యలు చేపడుతున్నా అదుపు చేయడం సవాలుగానే ఉంది. వృద్ధులు, ఐటీ సంస్థల్లో పనిచేసే వారే లక్ష్యంగా మోసాలకు పాల్పడుతున్నారు. చెన్నై శివారు ప్రాంతాల్లో ఈ తరహా ఘటనలు అధికంగా జరుగుతున్న క్రమంలో ఇతర జిల్లాల్లోని వారూ బాధితులుగా మిగులుతున్నారు. ఊటీకి చెందిన ఓ వృద్ధుడు కొన్ని రోజుల క్రితం రూ.12 లక్షలు పోగొట్టుకున్నారు. ఈ నేపథ్యంలో బ్యాంకు అధికారి మాట్లాడుతూ... బ్యాంకు నుంచి ఫోన్ చేసి ఖాతా వివరాలను ఎవరూ అడగరని, అలా ఎవరైనా అడిగితే వెంటనే 1860 నెంబరును సంప్రదించాలని తెలిపారు. సైబర్ నేరాలపై 1930 అనే కంట్రోల్ రూమ్ నెంబరు ఉన్నప్పటికీ దాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు. వచ్చిన పోలీసులు తెలుపుతున్నారు. కొత్త నెంబర్ల నుంచి ఫోన్ వస్తే అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.



నృత్య ప్రదర్శన తిలకిస్తున్న గవర్నర్ దంపతులు తదితరులు

రాజ్‌భవన్‌లో వైభవంగా నవరాత్రి కొలువు

చెన్నై, న్యూస్‌టుడే: గవర్నర్ అధికారిక నివాసమైన గిండిలోని రాజ్‌భవన్‌లో శరన్నవరాత్రి వేడుకలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఏడో రోజు వేడుకల్లో భాగంగా నృత్య ప్రదర్శన నిర్వహించారు. త్రిదేవి శృతి నృత్య ప్రదర్శనను జైవంతి, ఆధ్యాత్మిక గీతాల ప్రదర్శనను శృతి ఎస్.భట్, వారి బృందం నిర్వహించారు. ఈ నృత్యాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని గవర్నర్ ఆర్.ఎన్.రవి, ఆయన సతీమణి లక్ష్మి, రాజ్‌భవన్ అధికారులు తిలకించారు. కళాకారులను పురస్కారాలతో గవర్నర్ దంపతులు సత్కరించారు.

మృతుల కుటుంబాలకు ప్రభుత్వ సాయం వెల్లడి

చెన్నై, న్యూస్‌టుడే: తిరుప్పూర్ జిల్లా మైవాడి గ్రామంలోని కరుప్పసామిపుదూర్ కొత్త బైపాస్ రోడ్డులో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దిండుగల్ జిల్లా ఇంద్రానగర్ వాసులైన ఒకే కుటుంబానికి చెందిన మనోన్మణి (65), త్యాగరాజన్ (45), ప్రీతి (40), జయప్రియన్ (12) మరణించిన ఘటనపై ముఖ్యమంత్రి స్టాలిన్ విచారం వ్యక్తం చేశారు. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోయంబత్తూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నారాయన్ (80)కు ప్రత్యేక చికిత్సలు అందించాలని సూచించారు. మృతుల కుటుంబ సభ్యులకు, బంధువులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు చొప్పున, తీవ్రంగా గాయపడినవారికి రూ.లక్ష చొప్పున సీఎం పబ్లిక్ రిలీఫ్ ఫండ్ నుంచి అందించాలని అధికారులను ఆదేశించారు.

సెంటర్ మీడియన్లలో పువ్వుల మొక్కలు

నాటేందుకు జీసీసీ సన్నాహాలు

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై నగరాన్ని సుందరంగా మార్చే చర్యల్లో భాగంగా రోడ్లలోని సెంటర్ మీడియన్లలో 10వేల పువ్వుల మొక్కలను నాటాలని చెన్నై మహానగర కార్పొరేషన్ యంత్రాంగం నిర్ణయించింది. జీసీసీ తరపున రోడ్లలోని సెంటర్ మీడియన్లలో ఇప్పటికే పచ్చదనాన్ని సంరక్షిస్తుండగా వాటిలో అందమైన పువ్వుల మొక్కలను పెంచాలని నిర్ణయించింది. అటవీశాఖ సహకారంతో 10వేల మొక్కలు నాటడానికి చర్యలు చేపట్టింది. పలు జిల్లాలకు చెందిన మొక్కలు, పొదలు రకానికి చెందిన పువ్వుల మొక్కలను నాటడానికి సన్నాహాలు చేపట్టింది. జీసీసీ యంత్రాంగం ప్రతిపాదనను అటవీశాఖ ఆమోదించింది. నన్మంగళం, అన్నానగర్, కరసంగాల్ వంటి ప్రాంతాల్లోని సెంటర్ మీడియన్లలో ఈ మొక్కలను నాటి సంరక్షించనున్నారు. వర్షాలు ప్రారంభమైతే పెరిగేలా నవంబరు 15లోగా పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు.



ఒప్పందాలతో ఆచార్యులు అశ్విన్ మహాలింగం, మోహిత్ ముత్రేజ తదితరులు

ఐఐటీఎంలో కొత్త ప్రయోగశాల ప్రారంభం

వడపళని, న్యూస్‌టుడే: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మద్రాస్ (ఐఐటీఎం)లో నూతనంగా 'క్వాంటిటేటివ్ రిసెర్చ్ ల్యాబ్' ప్రారంభమైంది. ఆల్ఫాగ్రెప్ సెక్యూరిటీస్ సంస్థ సీఎస్సార్ నిధుల కింద రూ.5.65 కోట్లతో ల్యాబ్‌కు పెట్టుబడి పెట్టిందని ఐఐటీ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. 'ఏఐ ఫర్ క్వాంటిటేటివ్ ఫైనాన్స్', ఫైనాన్షియల్ మార్కెట్లుపై పరిశోధనలు, క్వాంటిటేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్, క్వాంటిటేటివ్ రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి పరిశోధనలకు ఈ ల్యాబ్ ఉపయోగకరంగా ఉంటుందని వివరించింది. ఐఐటీ ఆచార్యులు, డైరెక్టర్ వి.కామకోటి సమక్షంలో అలూమ్ని, కార్పొరేట్ రిలేషన్స్ డీన్, ఆచార్యులు అశ్విన్ మహాలింగం, ఆల్ఫాగ్రెప్ సెక్యూరిటీస్ సంస్థ ఎండీ మోహిత్ ముత్రేజ గురువారం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఐఐటీ వధ్వాని స్కూల్ ఆఫ్ డాటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హెడ్, ఆచార్యులు బి.రవీంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయుడు తిరుమావేలన్‌కు మాతృ వియోగం

చెన్నై, న్యూస్‌టుడే: కలైజ్ఞర్ న్యూస్ ఛానెల్ ఎడిటర్, సీనియర్ పాత్రికేయుడు తిరుమావేలన్ తల్లి, కవి పడిక్కరాము సతీమణి ముత్తులకుమి మరణించారు. ఆమె మృతికి డీఎంకే అధ్యక్షుడైన ముఖ్యమంత్రి స్టాలిన్ సంతాపం తెలిపారు. తల్లిని కోల్పోయి బాధపడుతున్న తిరుమావేలన్, భార్య వియోగంతో బాధపడుతున్న పడిక్కరాము, వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మంత్రి స్వామినాథన్ తన సంతాప ప్రకటనలో.. ముత్తులకుమి మరణవార్త బాధాకరమన్నారు. ఆమె మృతికి సంతాపం, ఆమె కుటుంబ సభ్యులు, పత్రికా రంగ మిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విద్యుత్తుశాఖ పీటీఆర్‌కు అప్పగించాల్సింది

మాజీ మంత్రి కరుప్పణన్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ జిల్లా భవానిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి కరుప్పణన్ పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చిన్నారులను లైంగికంగా వేధిస్తున్న వారిని ఎన్‌కౌంటర్ చేయడం లేదా ఉరిశిక్ష విధించేలా ముఖ్యమంత్రి ప్రత్యేక చట్టాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. రాష్ట్రంలో హత్యలు, దోపిడీలు నిత్యకృత్యమయ్యాయని ఆరోపించారు. రాష్ట్రంలో అన్నాడీఎంకే, భాజపా విడిపోవడంతో కేంద్రంలోని భాజపా ప్రభుత్వం మైనారిటీలోకి వెళ్లిందన్నారు. భాజపా పాలిత రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు మంజూరు చేస్తోందని, ఇతర రాష్ట్రాలకు అదే స్థాయిలో మంజూరు చేయడంలేదని ఆరోపించారు. ప్రజల సొమ్ము దోచుకొని జైలుకెళ్లి బెయిల్‌పై బయటికి వచ్చిన సెంథిల్ బాలాజీకి మళ్లీ మంత్రి పదవి కట్టబెట్టడం ఎంతవరకు న్యాయమన్నారు. మాజీ ఆర్థికశాఖ మంత్రి పళనివేల్ త్యాగరాజన్‌కి విద్యుత్తు శాఖ అప్పగించి ఉంటే విద్యుత్తు కోతలకు తావుండేది కాదని పేర్కొన్నారు.



లైసెన్సులు పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

40 వేల మంది వాహన చోదకుల
లైసెన్సులు రద్దు

ఆరు నెలల్లో నిబంధనలు ఉల్లంఘించడంతో చర్యలు

- న్యూస్‌టుడే, వడపళని

రాష్ట్రంలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి గత ఆరు నెల్లలో వాహనాలు నడిపిన 40వేల మంది లైసెన్సులను రద్దు చేశారు. సరైన లైసెన్సులు లేకుండా ఇష్టానుసారంగా వాహనాలు నడపడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో ట్రాఫిక్ విభాగం ప్రమాదాల నివారణ ఆధారంగా పలు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. సుప్రీంకోర్టు కమిటీ రోడ్డు భద్రతలను దృష్టిలో ఉంచుకుని సిగ్నల్ వద్ద ఆగకుండా వెళ్లినా, అధిక వేగం, ఎక్కువ మంది ప్రయాణికులతో వెళ్లినా, వాహనాలు నడుపుతూ సెల్ ఫోన్లలో మాట్లాడినా, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి లైసెన్సు రద్దు చేయాలని పేర్కొంది.

ఈ-చలాన్లు

నిబంధనలను ఉల్లంఘించిన వారిని ప్రత్యక్షంగానో లేదా కెమెరా ద్వారానో గుర్తించి పోలీసులు ఈ-చలాన్లు జారీ చేసి, వివరాలను ప్రాంతీయ రవాణా కార్యాలయానికి పంపుతారు. ఆర్టీవో కార్యాలయాలు వాహన చోదకుని డ్రైవింగ్ లైసెన్సు, రిజిస్ట్రేషన్ కార్డులో ఉన్న చిరునామాకు పోస్టాఫీసు ద్వారా నోటీసు జారీ చేస్తుంది. నోటీసు అందిన పది రోజుల్లోగా వాహన చోదకులు ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడనట్టయితే సరైన ఆధారాలతో చూపించాల్సి ఉంటుంది. వారి

1.8 లక్షల మందిపై చర్యలకు సిఫార్సు

ఈ ఏడాదిలో ఇప్పటివరకు 1.8 లక్షల మంది వాహన చోదకుల లైసెన్సులను రద్దు చేయాల్సిందిగా ట్రాఫిక్ పోలీసు విభాగం ఆర్టీవోకు సిఫార్సు చేసింది. అందులో ఆర్టీవో 40 వేల మంది లైసెన్సులను రద్దు చేశారు. ట్రాఫిక్ పోలీసులు లైసెన్సును వారి వద్ద ఉన్న పరికరం ద్వారా వాహన్ పోర్టల్‌లో దాని స్థితిగతులు తెలుసుకుంటారు. నిబంధనలు మీరినట్లు తెలిస్తే వారికి జరిమానా విధిస్తున్నారు. ఈ విధానంలో అదనపు జరిమానాగా రూ.5 వేలు చెల్లించాల్సి ఉంటుంది.

నుంచి అందిన సమాధానం నమ్మశక్యంగా ఉంటే ఎలాంటి చర్యలు తీసుకోరు. లేనిపక్షంలో లైసెన్సును మూడు నెలపాటు సస్పెండ్ చేస్తారు. పది రోజుల్లోగా సమాధానం రాకపోతే లైసెన్సు రద్దు చేసే అధికారం ఆర్టీవోకు ఉంది.

5 శాతం తగ్గిన ప్రమాదాలు

మోటారు వాహనాల ప్రమాదాల కేసుల్లో ప్రత్యేక గుర్తింపు కలిగిన న్యాయవాది ఆర్.శ్రీనివాసన్ మాట్లాడుతూ.. ఆర్టీవో కార్యాలయాల నుంచి నోటీసులు సక్రమంగా చేరేందుకు వారి చిరునామాలు వాహనాలకు సంబంధించిన పత్రాల్లో అప్‌డేట్ చేసి ఉంచాలన్నారు. వాహన్ పోర్టల్‌లో వచ్చే సంక్షిప్త సందేశాలను కూడా గమనిస్తుండాలని సూచించారు. పోలీసు విభాగంతో అవగాహన శిబిరాలు నిర్వహిస్తూ, వాహన తనిఖీలు పటిష్ఠం చేశామని, దీంతో అయిదు శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గాయని ప్రభుత్వం పేర్కొంది. ఈ ఏడాది జులై వరకు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 10,500 మంది మృత్యువాత పడ్డారు. ప్రమాదాలు మరింత తగ్గించేందుకు ప్రభుత్వం హైవేలపై గస్తీ పెంచాలనుకుంటోంది. ఇప్పటికే ఈ చర్యలతో ఈ ఏడాది ఇప్పటివరకు 8,800 మంది ప్రాణాలతో బయటపడ్డారు.

2024 జనవరి నుంచి జులై వరకు నమోదైన కేసులు

- వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్లో మాట్లాడిన వారు - **2,31,624** మంది.
- సిగ్నల్ వద్ద ఆగకుండా వెళ్లినవారు - **1,35,771** మంది.
- మద్యం సేవించి నడిపినవారు - **1,13,270** మంది.
- అధిక వేగంతో వెళ్లిన వాహనాలు - **1,05,097**.
- అత్యధిక లోడుతో వెళ్లిన వాహనాలు - **81,049**.
- 2023 జనవరి నుంచి జులై వరకు రద్దయిన లైసెన్సులు - **35,804**.



కందుల దుర్గేష్‌ను కలిసిన కృష్ణారావు

అమరజీవి భవనాన్ని సందర్శించండి

మంత్రిని ఆహ్వానించిన కార్యదర్శి కృష్ణారావు

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నైలోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనాన్ని సందర్శించాలని ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ను నిర్వాహక కమిటీ కార్యదర్శి, కోశాధికారి వి.కృష్ణారావు ఆహ్వానించారు. వెలగపూడిలోని సచివాలయంలో మంత్రిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. స్మారక భవనాన్ని సందర్శించేందుకు నవంబరులో రానున్నట్లు మంత్రి వెల్లడించారు. చెన్నై తిరువల్లిక్కేణిలోని మహాకవి భారతీయార్ స్మారక భవన నిర్వహణకు తమిళనాడు తగినంత నిధులు కేటాయించి ఆ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నారని, అమరజీవి స్మారక భవనాన్ని కూడా తగినంత నిధులు కేటాయించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందడానికి ప్రాముఖ్యత ఇవ్వాలని కృష్ణారావు కోరారు. గత ఐదేళ్లలో తగినంత నిధులు కేటాయింపు లేక భవనం నిర్వహణ కష్టతరంగా ఉందని, ఈ ప్రభుత్వంలో నిధులు కేటాయించి ఆదుకోవాలని కోరారు.

తెన్కాశి జిల్లాలోని రాళ్ల క్వారీ మూసేయాలి

చెన్నై, న్యూస్‌టుడే: తెన్కాశి జిల్లా ఓడకరై తులుక్కపట్టిలో చట్టవిరుద్ధంగా కొనసాగుతున్న రాళ్ల క్వారీని వెంటనే మూసివేయాలని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమె తన ప్రకటనలో.. తెన్కాశి జిల్లా ఆలంకుళం శాసనసభ నియోజకవర్గం పరిధిలోని పాప్పాకుడి యూనియన్ ఓడకరై తులుక్కపట్టిలో 350 ఎకరాల్లో మూడేళ్లుగా క్రషర్, రాళ్ల క్వారీ కొనసాగుతోందని తెలిపారు. బోరు వేసే భారీ యంత్రాలతో రాత్రి సమయంలో పనులు జరగడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న క్వారీని వెంటనే మూసివేయాలని కోరారు.

14 వరకు చెన్నైలో ట్రాఫిక్ ఆంక్షలు

వడపళని, న్యూస్‌టుడే: మెట్రో రైలు నిర్మాణ పనుల కారణంగా గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ పోలీసులు మౌంట్ పూనమల్లి రోడ్డు, బుహారి హోటల్ కూడలి, కత్తిపారా పైవంతెన ప్రాంతంలో తాత్కాలికంగా ట్రాఫిక్‌లో మార్పులు చేశారు. ఈ మార్పులు శుక్రవారం నుంచి సోమవారం వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.

◆ కత్తిపారా పైవంతెన నుంచి పోరూరు వైపునకు వెళ్లే వాహనాలకు ఎలాంటి ఆటంకాలు లేవు.

పోరూరు నుంచి కత్తిపారా...

బీఈఎల్ ఆర్మీ రోడ్డు కూడలి నుంచి మౌంట్ పూనమల్లి రోడ్డుకు దారి మళ్లించారు. వార్ సెమెట్రీ క్రాస్ రోడ్స్ బీఈఎల్ ఆర్మీ రోడ్డు కూడలి, బుహారి హోటల్, డిఫెన్స్ కాలనీ మొదటి అవెన్యూ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ◆ తేలికపాటి వాహనాలు సెయింట్ థామస్ హాస్పిటల్ రోడ్డు మీదుగా భట్ రోడ్డుకు రావాలి. ◆ ఇతర వాహనాలు కంటోన్మెంటు రోడ్డు, సుందర్ నగర్ 7వ క్రాస్, ధనకోటి రాజా వీధి, సిడ్కో ఇండస్ట్రియల్ ఎస్టేట్ సౌత్ ఫేజ్ రోడ్డు, ఒలింపియా క్రాస్ రోడ్స్ వంద అడుగుల రోడ్డు కూడలి మీదుగా మళ్లించారు. ◆ ఒలింపియా కూడలి నుంచి కత్తిపారా లేదా వడపళనికి గానీ వెళ్లొచ్చు.

రిప్పన్ బిల్డింగ్ ఎదుట యూటర్న్

ప్యారిస్: చెన్నై ఈవీఆర్ సాలైలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయమైన రిప్పన్ బిల్డింగ్ ఎదురుగా యూటర్న్ ఏర్పాటు చేసినట్లు గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈవీఆర్ సాలై-పీఎల్సీ జంక్షన్ వద్ద ఈ యూటర్న్‌ని బుధవారం మధ్యాహ్నం నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రాజా ముత్తయ్యసాలై నుంచి పీఎల్సీ జంక్షన్‌కి వచ్చే వాహనాలు పీఎల్సీ జంక్షన్‌లో కుడివైపు తిరిగి గాంధీ ఇర్విన్ జంక్షన్‌కి వెళ్లేందుకు అనుమతి ఉండటంతో ఈవీఆర్ సాలైలో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. నియంత్రించడానికి ప్రస్తుతం పీఎల్సీ సిగ్నల్ వద్ద రిప్పన్ బిల్డింగ్ ఎదురుగా యూ టర్న్ ఏర్పాటు చేశారు. రాజా ముత్తయ్యసాలై నుంచి వచ్చే వాహనాలు పీఎల్సీ జంక్షన్ వద్ద కుడివైపు మళ్లకుండా కొత్తగా ఏర్పాటు చేసిన యూటర్న్ గుండా గాంధీ ఇర్విన్‌సాలై జంక్షన్‌కి వెళ్లవచ్చు.

బాణసంచా ప్రమాదాలు అరికట్టాలి

వేళచ్చేరి, న్యూస్‌టుడే: దీపావళి పండుగ సమీపిస్తున్నందున బాణసంచా తయారీలో పాల్గొనే కార్మికులకు ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని జీకే వాసన్ విజ్ఞప్తి చేశారు. తిరుప్పూర్ పాండియన్ నగర్ నివాస ప్రాంతంలో టపాసులు తయారు చేస్తుండగా పేలి ముగ్గురు మృతి చెందడం బాధాకరమన్నారు. దీపావళి పండుగ సమీపిస్తున్నందున బాణసంచా ప్రమాదాలను నియంత్రించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. లైసెన్సులు లేకుండా నడుస్తున్న పరిశ్రమలపై చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

పెరిగిన విమాన ఛార్జీలు

వడపళని, న్యూస్‌టుడే: ఆయుధపూజ, విజయదశమిని పురస్కరించుకుని చెన్నై నుంచి ఇతర ప్రాంతాలకు విమాన ఛార్జీలు భారీగా పెరిగాయి. చెన్నై నుంచి మదురైకి రూ.12,026 నుంచి రూ.18,626, చెన్నై నుంచి ట్యుటికోరిన్‌కు రూ.121.736 నుంచి 13,626 వరకు వసూలు చేస్తున్నారు.

నాగపట్టిణం జాలర్లపై దాడి



బాధిత జాలర్లు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: నాగపట్టిణం సెరుదూర్ మత్స్యకార గ్రామంలోని సత్యశీలన్ అనే వ్యక్తికి సొంతంగా పడవ ఉంది. అందులో విజయన్, రామనన్, విఘ్నేష్‌కుమార్, రీహాన్ అనే నలుగురు జాలర్లు 8న సముద్రంలో చేపలవేటకు వెళ్లారు. బుధవారం రాత్రి కొడియకరై వద్ద చేపలు పడుతుండగా రెండు పడవల్లో వచ్చిన ఆరుగురు శ్రీలంక సముద్రపు దొంగలు వారిని కొట్టి బెదిరించి 250 కిలోల వల, సెల్‌ఫోన్లు, జీపీఎస్, డీజిల్ తదితర వస్తువులు లాక్కుని పారిపోయారు. తీరానికి తిరిగి వచ్చిన మత్స్యారులు వేదారణ్యం కోస్ట్ గార్డ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు.

విడిపించడానికి చర్యలు చేపట్టాలి: జీకే వాసన్

వేళచ్చేరి: శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిన తమిళనాడు మత్స్యకారులను విడిపించడానికి కేంద్రం చర్యలు తీసుకోవాలని టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్ కోరారు. ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో.. కేంద్ర ప్రభుత్వం శ్రీలంక ప్రభుత్వంతో చర్చలు జరిపి అరెస్టయిన రాష్ట్ర జాలర్లను విడిపించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

రిజర్వేషన్లు రద్దు చేయడమే కాంగ్రెస్ ఉద్దేశం: హెచ్.రాజా



విలేకరులతో మాట్లాడుతున్న హెచ్ రాజా

వేళచ్చేరి, న్యూస్‌టుడే: రిజర్వేషన్లను రద్దు చేయడమే కాంగ్రెస్ ఉద్దేశమని భాజపా సమన్వయకర్త హెచ్.రాజా ఆరోపించారు. మైలాడుదురైలో గురువారం పార్టీ సభ్యత్వ సమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అమెరికాలో మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు ప్రస్తుతం రిజర్వేషన్లు అవసరం లేదన్నారని తెలిపారు. ఇదే ఉద్దేశాన్ని జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ కూడా వ్యక్తం చేశారని హరియాణాలో భాజపాను ప్రజలు గెలిపించి కాంగ్రెస్‌కు గుణపాఠం నేర్పారని తెలిపారు.

దేవాదాయశాఖ జోక్యం తగదు..

వేళచ్చేరి: చిదంబరం నటరాజ ఆలయ విషయంలో దేవాదాయశాఖ జోక్యం చేసుకోకూడదని భాజపా సమన్వయకర్త హెచ్.రాజా కోరారు. చిదంబరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నటరాజ ఆలయంలో దీక్షితులకు నిర్వాహక హక్కు ఉందన్నారు. ఆలయ ఆస్తులను 1976 నుంచి ప్రత్యేక తహసీల్దారు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఆలయానికి సొంతమైన 2వేల ఎకరాల భూములను దీక్షితులు విక్రయించినట్లు దేవాదాయశాఖ అంటోందని, ప్రభుత్వ స్వాధీనంలో ఉన్నప్పుడు అది ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. 2006లో డీఎంకే ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత దీక్షితుల నుంచి నిర్వాహక బాధ్యతలను ప్రభుత్వం తీసుకొందన్నారు. 2014లో సుప్రీంకోర్టు తీర్పు తర్వాతే ఆ బాధ్యతలు దీక్షితుల వశమైందన్నారు.

ఎస్ఈలు ఉద్యోగ నియామకాలు చేపట్టొచ్చు

టీఎన్‌పీడీసీఎల్

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తు పంపిణీ కేంద్రాల్లోని సూపరింటెండెంట్ ఇంజినీర్లు(ఎస్ఈ) ఉద్యోగంలో ఉంటూ అనారోగ్య కారణాలతో విధుల్లోకి రాని వారికి, మృతి చెందిన వారి కుటుంబంలోని చట్టపరమైన వారసులను ఉద్యోగాలకు తీసుకోవచ్చని తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్(టీఎన్‌పీడీసీఎల్ గతంలో టాన్‌జెడ్కోలో ఒక భాగంగా ఉండేది) ఆదేశించింది. విద్యుత్తు సంస్థకు చెందిన పలు యూనియన్ సభ్యుల నుంచి ఇందుకు సంబంధించిన దరఖాస్తులు అనుమతి కోసం సీనియర్ అధికారుల వద్ద కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. ఏడాదికి రాష్ట్ర వ్యాప్తంగా 9,500 దరఖాస్తులందుతున్నాయన్నారు. జూనియర్ అసిస్టెంట్లు, మదింపుదారులు(అసెస్సర్స్), 3, 4 కేటగిరీలకు చెందిన వారిని విధుల్లోకి తీసుకోవడానికి ఎస్ఈలకు అధికారముందని, మానవతా హృదయంతో అవకాశాలు కల్పించవచ్చని టీఎన్‌పీడీసీఎల్ పేర్కొంది. ఉద్యోగాలు కల్పించేందుకు ప్రకటన జారీ చేసిన రోజు నుంచి చీఫ్ ఇంజినీర్లకు ఎలాంటి ప్రతిపాదనలు పంపాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. అసెస్సర్స్ ఉద్యోగాలు 7,000 వరకు ఖాళీలున్నాయని, భర్తీ చేయాలని తెలిపింది.

వళ్లలార్ అంతర్జాతీయ సెంటర్ నిర్మాణ పనులకు స్టే

ప్యారిస్: వళ్లలార్ అంతర్జాతీయ కేంద్రం నిర్మాణ పనులకు మద్రాసు హైకోర్టు స్టే విధించింది. వడలూరు వళ్లలార్ సత్యజ్ఞాన సభలో వళ్లలార్ అంతర్జాతీయ కేంద్రం నిర్మాణానికి వ్యతిరేకంగా దాఖలైన కేసులు జస్టిస్ సురేష్‌కుమార్, జస్టిస్ సౌందర్ ధర్మాసనం విచారిస్తోంది. వళ్లలార్ ఆలయ వెనుకవైపు వళ్లలార్ అంతర్జాతీయ కేంద్రం ఏర్పాటుకు, ఆలయం నుంచి కి.మీ. దూరంలో ఉన్న స్థలంలో వృద్ధాశ్రమం, సిద్ధవైద్య ఆస్పత్రి తదితర నిర్మాణాలు చేపట్టేలా వ్యవసాయ భూములను మార్చేందుకు ఇచ్చిన అనుమతికి వ్యతిరేకంగా కొత్త పిటిషన్ దాఖలైంది. పిటిషన్ విచారణ సమయంలో చట్ట నిబంధనలు పాటించకుండా ఆమోదం ఇచ్చారని, నిషేధం విధించాలని పిటిషనర్ తరపున వాదించారు. అనుమతులు నిబంధనల ప్రకారమే పొందినట్లు, పిటిషన్ కొట్టివేయాలని దేవాదాయశాఖ తరపున వాదించారు. అన్ని వాదనలు విన్న ధర్మాసనం వళ్లలార్ ఆలయం వెనుకవైపు మరో ఉత్తర్వులు వచ్చే వరకు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టకూడదని స్టే విధించింది. కి.మీ. దూరంలో ఉన్న భూ మార్పిడికి సంబంధించి టౌన్ ప్లానింగ్ డైరక్టరు నిబంధనలు ప్రకారం ఆమోదం ఇచ్చారని, అక్కడ పనులు చేపట్టడానికి ఎలాంటి నిషేధం లేదని తెలిపి తదుపరి విచారణ 17కి వాయిదా వేశారు.

వలస కార్మికుల రక్షణకు కమిటీ

సైదాపేట, న్యూస్‌టుడే: వలస కార్మికుల పని పరిస్థితులు మెరుగుపరిచేందుకు కార్మిక సంక్షేమశాఖ తరపున కమిటీ ఏర్పాటు చేశారు. చెన్నైలో బుధవారం కార్మిక సంక్షేమ కమిషనర్ అతుల్ ఆనంద్ నేతృత్వంలో రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. వలస కార్మికుల వివరాల నమోదు, వారికి చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించటం, భవన నిర్మాణ కార్మికులను తమిళనాడు భవన నిర్మాణ బోర్డులో నమోదు చేయించటం తదితర విషయాలపై చర్చించారు. అక్టోబరు 8 వరకు కార్మికశాఖ వెబ్‌సైట్‌లో ఇతర రాష్ట్రాల విభాగంలో 9,36,160 వలస కార్మికులు నమోదు చేసుకున్నట్లు కమిషనర్ తెలిపారు.

'డీఎంకేది కార్పొరేట్ పాలన'

సైదాపేట, న్యూస్‌టుడే: డీఎంకేది కార్పొరేట్ పాలనని అన్నాడీఎంకే మాజీ మంత్రి జయకుమార్ విమర్శించారు. గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సామ్‌సంగ్ కార్మికులను అర్ధరాత్రి పోలీసులతో అరెస్టు చేయించడం దారుణమన్నారు. ఆందోళన చేస్తున్న వారిని పిలిచి మాట్లాడకుండా కొందరు నకిలీ వ్యక్తులతో మాట్లాడి ఆందోళన ముగిసిందని ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ చెప్పిందన్నారు. మంత్రుల వ్యాఖ్యలను చూస్తే ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు కార్పొరేట్ సంస్థలకు అమ్ముడుపోయినట్లు తెలుస్తోందని ధ్వజమెత్తారు.

వీఐటీలో విద్యార్థి సంఘం ప్రారంభం



ప్రసంగిస్తున్న ఐజీ అస్రాగార్గ్

వేలూర్: వేలూర్ వీఐటీలో విద్యార్థి సంఘం ప్రారంభోత్సవం గురువారం జరిగింది. కార్యక్రమానికి వీఐటీ కులపతి జి.విశ్వనాథన్ నేతృత్వం వహించి సంఘాన్ని ప్రారంభించి మాట్లాడారు. సంఘం నిర్వాహకులు ఉపాధ్యాయులు, విద్యార్థులకు మధ్య వారధిగా ఉండాలన్నారు. విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను గుర్తించి వారికి సాయపడాలన్నారు. ముఖ్య అతిథిగా నార్త్ జోన్ పోలీస్ ఐజీ అస్రాగార్గ్ విచ్చేశారు. వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, జీవీ సెల్వం, ఉపకులపతి కాంచనా భాస్కరన్, రిజిస్ట్రార్ జయభారతి తదితరులు పాల్గొన్నారు.

మియాట్‌లో కిడ్నీ మార్పిడి విజయవంతం



చికిత్స పొందిన యువకుడితో ఆసుపత్రి వైద్యులు

వడపళని, న్యూస్‌టుడే: అరుదైన బాంబే ఓ బ్లడ్ గ్రూపులోని 'అక్రాస్ బ్లడ్ గ్రూపు'తో కిడ్నీ మార్పిడి చికిత్సను మియాట్ ఆసుపత్రి విజయవంతంగా నిర్వహించింది. ఆసుపత్రి గురువారం విడుదల చేసిన ప్రకటన మేరకు. . 30 ఏళ్ల యువకుడు దాదాపు ఏడాదిపాటు మియాట్‌లో డయాలసిస్ చేయించుకుంటూ వచ్చాడు. ఆయనది బాంబే ఓ బ్లడ్ గ్రూపు. ఈ రకమైన రక్తం చాలా అరుదుగా ఉంటుంది. భారత్‌లో పదివేల మందిలో ఒకరికి మాత్రమే ఇలాంటిది ఉంటుందన్నారు. రోగి తల్లి తన మూత్రపిండం దానం చేయడానికి ముందుకొచ్చారు. రోగిలో యాంటీ హెచ్ యాంటీబాడీస్ ఉండటంతో సాధ్యపడలేదు. అయితే ఆసుపత్రిలోని అవయవ మార్పిడి నిపుణులు తమ అనుభవంతో మూత్రపిండ మార్పిడి చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. యాంటీ హెచ్ యాంటీ బాడీ టైటర్స్‌ను యథాస్థితికి తీసుకొచ్చినట్లు మియాట్ ప్రకటనలో తెలిపింది.

జలవనరుల పర్యవేక్షణకు ప్రత్యేక కేంద్రాలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈశాన్య రుతుపవనాలు ప్రారంభమవనున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా 24 గంటలపాటు జలవనరులను పర్యవేక్షించడానికి జవనరులశాఖ చర్యలు చేపట్టింది. ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో 112 శాతానికి పైగా వర్షం అధికంగా కురుస్తుందని వాతావరణ పరిశోధన కేంద్రం అంచనా వేసింది. దీంతో ముందస్తు చర్యల వ్యవహారంగా జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, చీఫ్ ఇంజినీరు మన్మదన్ తదితరులు ఈ నెల 8వ తేదీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈశాన్య రుతుపవనాల వర్షం ప్రారంభమైనప్పటి నుంచి జలవనరులు, జల మార్గాలను 24 గంటలు పర్యవేక్షించాలని తీర్మానించారు. ఇందుకుగాను చెన్నై చేపాక్కంలోని జలవనరుల శాఖ ప్రధాన కార్యాలయంలో ప్రధాన కంట్రోల్ రూం, చెన్నై, కోవై, మదురై, తిరుచ్చి జిల్లాలలో జోనల్ కంట్రోల్ రూంలను ప్రారంభించారు. వీటిలో 24 గంటలపాటు రెండు షిఫ్టులలో ఇంజినీర్లు, అధికారులను విధులకు నియమించారు. ఈశాన్య రుతపవనాల వర్షాలు మొదలైతే ఈ కేంద్రాలు పనిచేస్తాయని శాఖాధికారులు తెలిపారు. ఈ కేంద్రాలలో పొందే సమాచారాన్ని వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయానికి, రాష్ట్ర రెవెన్యూ, ప్రకృతి వైపరీత్యాల కేంద్రానికి తెలియజేసే సౌకర్యాలు అందుబాటులో ఉంచారు.

15ఏళ్ల తర్వాత వేగంగా రోడ్ల నిర్మాణం



మాట్లాడుతున్న మంత్రి రఘుపతి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 15ఏళ్ల తర్వాత రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని న్యాయశాఖ మంత్రి రఘుపతి తెలిపారు. పుదుకోట్టై జిల్లా కడియపాడిలో గ్రామ పంచాయతీ స్థాయి కమిటీ సమాఖ్యకు రూ.71.35లక్షల వ్యయంతో నిర్మించిన భవనాలను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రిగా స్టాలిన్ బాధ్యతలు చేపట్టాక గ్రామాల అభివృద్ధిపై శ్రద్ధ వహించారని తెలిపారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రి గ్రామ రహదారుల పథకాన్ని తీసుకొచ్చి రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా తాగునీటి కొరత తీర్చడానికి తొట్టెలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు.

సాంకేతిక పనులకు గ్యాంగ్‌మెన్‌ల వినియోగ వ్యవహారం

టాన్‌జెడ్కో సమాధానం కోరిన హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: విద్యుత్తు బోర్డులో సాంకేతిక పనులకు గ్యాంగ్‌మెన్‌లను ఉపయోగించకూడదని దాఖలైన పిటిషన్‌పై టాన్‌జెడ్కో జవాబు ఇవ్వాలని మద్రాసు హైకోర్టు ఆదేశించింది. తమిళనాడు విద్యుత్తు బోర్డులో గత నాలుగేళ్లలో సాంకేతిక పనులకు నైపుణ్యం లేని గ్యాంగ్‌మెన్‌లను ఉపయోగించడంతో 70 మంది మృతిచెందారని, కావున శిక్షణ లేని సిబ్బందిని సాంకేతిక పనులకు ఉపయోగించకూడదని విద్యుత్తు బోర్డును ఆదేశించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ వ్యవహారమై హైకోర్టు ఇదివరకే జారీచేసిన ఉత్తర్వులను గత రెండేళ్లుగా విద్యుత్తుబోర్డు పాటించలేదని, అందువల్లనే ఇటీవల తిరునెల్వేలి జిల్లాలో గ్యాంగ్‌మెన్ మృతిచెందినట్లు తెలిపారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిపిన జస్టిస్ బాలాజీ, జస్టిస్ అరుళ్ మురుగన్ ధర్మాసనం.. టాన్‌జెడ్కో రెండు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చింది.



యాత్రీగన్ తొలి షెడ్యూల్ పూర్తి

చెన్నై, న్యూస్‌టుడే: ఆర్.ఎం.పి. ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత వీజీ ధనలక్ష్మి గోపాలన్ సమర్పించిన చిత్రం 'యాత్రీగన్'. వర్ధమాన దర్శకుడు ప్రేమ్ నజీర్ మెగాఫోన్ పట్టుకున్నారు. బిగ్‌బాస్ ఫేమ్ దర్శన్, మాళవిక జంటగా నటిస్తున్నారు. కాళి వెంకట్, ప్రాంక్ స్టార్ రాహుల్, భాను తదితరులు ఇతర నటీనటులు. చిత్రానికి సంగీతం అభిషేక్ సమకూర్చుతున్నారు. నిజజీవితంలో జరిగిన కొన్ని నేర ఘటనల నేపథ్యంలో ఎమోషనల్, క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. మంచి ప్రమాణాలు, భావోద్వేగాలతో కూడిన చిత్రాన్ని నిర్మించాలని భావించినప్పుడు 'యాత్రీగన్' కథను ప్రేమ్‌నజీర్ వినిపించారని నిర్మాత తెలిపారు. కథ తమ ఆకాంక్షకు తగినట్లు ఉండటం, శీను రామసామి, ముత్తయ్య, ఎస్ఆర్ ప్రభాకరన్ వంటి దర్శకుల వద్ద ప్రేమ్ నజీర్ పనిచేయడం వంటి కారణాలతో 'యాత్రీగన్' తెరకెక్కించడానికి ముందుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఇది ఇద్దరు వేర్వేరు వ్యక్తులు, వారి వేర్వేరు సిద్ధాంతాలకు సంబంధించిన కథ అని ప్రేమ్ నజీర్ అన్నారు. అంతుచిక్కని ఓ ఘటన వారి సమస్యలను ఎలా పెనవేసిందనే విషయమే కథ అన్నారు. తొలి షెడ్యూల్ పూర్తయిన నేపథ్యంలో మలివిడత చిత్రీకరణ త్వరలో ప్రారంభం కానుందని పేర్కొన్నారు.

అజిత్‌కుమార్ కొత్త లుక్



చెన్నై, న్యూస్‌టుడే: ఆదిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో అజిత్ కుమార్, త్రిష జంటగా నటిస్తున్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. చిత్రీకరణ స్పెయిన్‌లో జరగనుంది. చిత్రంలోని అజిత్‌కుమార్ కొత్త లుక్‌కు సంబంధించిన ఫొటోను దర్శకుడు ఆదిక్ రవిచంద్రన్ తన సామాజిక మాధ్యమ పేజీలో పంచుకున్నారు. వైట్ అండ్ వైట్ కోటు, సూటు ధరించి నవ్వుతూ ఉన్న అజిత్‌కుమార్ ఫొటో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.

మరికొన్ని సినీ విశేషాలు

◆ నటుడు విజయ్, దర్శకుడు వెంకట్ ప్రభు కాంబినేషన్లో రూపొందిన 'ది గోట్'(ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) సెప్టెంబరు 5న విడుదల కాగా గత 3న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైంది. 6వ తేదీ వరకు నెట్‌ఫ్లిక్స్‌లో ఎక్కువగా చూసిన చిత్రాల జాబితాలో తొలిస్థానంలో ఉండటం గమనార్హం.

◆ తమిళరసన్ పచ్చముత్తు దర్శకత్వంలో అట్టకత్తి దినేశ్, హరీశ్ కల్యాణ్ ప్రధాన పాత్రధారులుగా నటించిన 'లబ్బర్ పందు' విడుదలై మూడు వారాలైన ప్రేక్షకాదరణ తగ్గలేదు. రానున్న 18న ఓటీటీలో విడుదల చేయనున్నట్లు సమాచారం.

◆ పొటెన్షియల్ స్టూడియోస్ పతాకంపై బాలసుబ్రమణి దర్శకత్వంలో నటుడు జీవ, ప్రియ భవానీశంకర్ జంటగా నటించిన చిత్రం 'బ్లాక్'. ఈనెల విడుదల కానున్న నేపథ్యంలో యు/ఏ ధ్రువపత్రాన్ని సెన్సార్ బోర్డు అందించింది.

విడుతలై 2 డబ్బింగ్ ప్రారంభం

చెన్నై, న్యూస్‌టుడే: వెట్రిమారన్ దర్శకత్వంలో సూరి, విజయ్ సేతుపతి ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'విడుతలై-2'. గతేడాది విడుదలై విజయం సాధించిన 'విడుదలై'కు రెండో భాగం. ఎల్ రెడ్ కుమార్ నిర్మిస్తున్న చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా స్వరాలు సమకూర్చారు. మంజు వారియర్, అనురాగ్ కశ్యప్, కిషోర్, రాజీవ్ మేనన్, గౌతంవాసుదేవ్ మేనన్, బోస్ వెంకట్, భవానీశ్రీ, విన్సెంట్ అశోకన్ తదితరులు నటించారు. రానున్న డిసెంబరు 20న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. డబ్బింగ్ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఇందులో విజయ్‌సేతుపతి, సూరి పాల్గొన్నారు.



డబ్బింగ్ సందర్భంగా విజయ్ సేతుపతి, సూరి, వెట్రిమారన్

'వేట్టెయన్' వీక్షించిన సినీ ప్రముఖులు

చెన్నై: సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'వేట్టెయన్' గురువారం విడుదలైన నేపథ్యంలో తొలిరోజు తొలి ప్రదర్శనను చెన్నైలోని రోహిణి థియేటర్‌లో నటుడు ధనుష్, సంగీత దర్శకుడు అనిరుధ్, రజనీకాంత్ భార్య లతా రజనీకాంత్, అతని కుమార్తెలు ఐశ్వర్య, సౌందర్య చూసి ఆనందించారు. ప్రముఖ నటుడు విజయ్ చెన్నైలోని దేవీ థియేటర్‌లో వీక్షించారు.

చర్మం వ్యర్థాలతో నూలు ఉత్పత్తి

సీఎల్ఆర్ఐ సరికొత్త సాంకేతికత ఆవిష్కరణ

విల్లివాక్కం, న్యూస్‌టుడే: చర్మంతో వస్తువులు తయారు చేస్తున్నప్పుడు బయటకి వచ్చే వ్యర్థాల నుంచి పర్యావరణానికి హాని కలగకుండా జౌళి సంస్థలలో ఉపయోగిస్తున్న నూలు తయారు చేయడానికి సీఎల్ఆర్ఐ (సెంట్రల్ లెదర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) కొత్త సాంకేతికతను ఆవిష్కరించింది. ఈ సాంకేతికత హక్కులను సీఎల్ఆర్ఐ కేహెచ్ ఎక్స్‌పోర్టుకు ఇచ్చింది. పశువులు, మేకల నుంచి వచ్చే ముడి చర్మాన్ని ఉపయోగించి పాదరక్షలు, బ్యాగులు, బూట్లు తదితర వస్తువులు తయారు చేస్తున్నారు. చర్మం తీసే సమయంలో వచ్చేయ తొలిదశ వ్యర్థం ఉపయోగించి షీట్ రూపొందిస్తుండగా అంచును సరి చేస్తున్న సమయంలో అధికంగా వ్యర్థాలు బయటకు వస్తాయి. వాటిని తొలగించి తగలబెట్టడం వల్ల పర్యావరణ కాలుష్యయేర్పడుతోంది. దీనికి పరిష్కారంగా చెన్నై గిండిలోని సీఎస్ఐఆర్-సీఎల్ఐఆర్ సంస్థ చర్మపు వస్తువులు తయారు చేయడానికి కొత్త సాంకేతికతను ఆవిష్కరించింది. ఆ మేరకు ప్రస్తుతం చర్మపు ఘన వ్యర్థాలు, పత్తి, వెదురు ఆకులను ఉపయోగించి నూలు తయారు చేయనుంది. ఈ వివరాలను బుధవారం నిర్వహించిన సీఎస్ఐఆర్ వార్షికోత్సవంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి అరుణ్‌రాయ్, సీఎల్ఆర్ఐ సంచాలకుడు శ్రీరామ్, శాస్త్రవేత్త నిషాద్ ఫాతిమా తెలిపారు. తయారు చేసిన నూలు నుంచి జౌళి పాదరక్షలు, వస్త్ర సంచులు, షూ లేస్‌లు వంటి వస్తువులు ఉత్పత్తి చేయవచ్చని పేర్కొన్నారు. సీఎల్ఐఆర్ ఆవిష్కరించిన కొత్త సాంకేతికతను ఉయోగించి కేహెచ్ ఎక్స్‌పోర్ట్స సంస్థ వస్తువులు తయారు చేసి మార్కెట్టులో విక్రయిస్తుందని తెలిపారు.

10 జిల్లాల్లో సహకార మార్కెట్‌లు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రైతులకు గిట్టుబాటు ధర, ప్రజలకు తక్కువ ధరకు నాణ్యతతో కూడిన కూరగాయలు లభించడానికి గ్రామాలలో సహకార మార్కెట్లు ఏర్పాటు చేయడానికి రాష్ట్ర సహకారశాఖ నిర్ణయించింది. రైతుల నుంచి కూరగాయలు, పండ్లు నేరుగా కొనుగోలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజలకు చేరువ చేసే పనులలో సహకారశాఖ నిమగ్నమైంది. ఇందుకుగాను కూరగాయలు అధికంగా పండుతున్న జిల్లాలలో కొనుగోలు చేసి చెన్నై, తంజావూరు, కన్నియాకుమరి తదితర అన్ని జిల్లాలకు చేర్చే విధంగా మార్గాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారు. ఈ మార్గాలలో ఉన్న నగరాలలో కూరగాయల దుకాణాలు ప్రారంభించనున్నారు. ఇందుకోసం జిల్లాలలోని ముఖ్యమైన ప్రాంతాలలో 10 నుంచి 20 దుకాణాలు చోటుచేసుకునే విధంగా సహకార మార్కెట్లు ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. ఇక్కడ నాణ్యతతో కూడిన కూరగాయలు తక్కువ ధరకు విక్రయిస్తారు. రైతులు తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర పొందుతారు. మొదటి విడతగా 10 జిల్లాలలో వీటిని ఏర్పాటు చేస్తారు. ముందుగా సేలం జిల్లా పెత్తనాయకన్‌పాళయంలోని చిన్నకల్రాయన్ ప్రాంతంలో 1,600 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.20 లక్షలతో ఏర్పాటు చేయనున్నట్టు సహకార శాఖాధికారులు తెలిపారు.



పళ్లిపట్టు: దుర్గాదేవిగా శ్రీకొళ్లాపురమ్మ



ప్యారిస్: అశ్వ వాహనంపై దుర్గాదేవిగా కన్యకాపరమేశ్వరి



పళ్లిపట్టు: సరస్వతి అలంకరణలో తోపాలమ్మన్



పళ్లిపట్టు: వెండి కవచం ధరించిన కన్యకాపరమేశ్వరి



తిరువణ్ణామలై: సరస్వతీదేవి అవతారంలో పరాశక్తి

దయచూడమ్మా.. దుర్గమ్మా

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: పళ్లిపట్టు పట్టణ దేవత శ్రీకొళ్లాపురమ్మ ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారధనలు జరిగాయి. సాయంత్రం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. అదేవిధంగా మేళపూడి గ్రామంలోని తోపాలమ్మన్ ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ❖ పళ్లిపట్టు బజారు వీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి గురువారం వెండి కవచం తొడిగారు. అనంతరం హోమ పూజలు, దీక్షాబంధనం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. **ప్యారిస్:** జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో గురువారం అమ్మవారికి త్రికాల అభిషేకాలు, అలంకరణలు, ఆరాధనలు చేశారు. సాయంత్రం అశ్వవాహనంపై దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా చుక్కల విజయలక్ష్మి, శ్రీ వాసవి స్తోత్ర రంజని, సత్సంగం భజనావళి, శ్రీలక్ష్మీనారాయణ మెట్రిక్యులేషన్ మహోన్నత పాఠశాల విద్యార్థుల భక్తీ గీతాలాపన, మహామంత్ర భజన మండలి నామ సంకీర్తనం భక్తిభావాన్ని పెంచాయి. గురువారం ఉత్సవానికి ఎస్‌కేపీడీ పాలక మండలి సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యదర్శి కిషోర్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. **తిరువణ్ణామలై:** తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో పరాశక్తి అమ్మవారికి గురువారం ప్రత్యేక అభిషేకాలు, దీపారాధనలు జరిగాయి. సాయంత్రం సరస్వతి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.



తిరుత్తణి: పట్టణంలోని ఓ ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

సూర్యప్రభ వాహనంపై వేంకటేశ్వరుని వైభవం



సూర్యప్రభ వాహనంపై స్వామివారు

టీనగర్, న్యూస్‌టుడే: తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్న నేపథ్యంలో చెన్నై టీనగర్ వెంకటనారాయణ రోడ్‌లోని తితిదే శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ బ్రహ్మోత్సవాలను నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం స్వామివారు పలు అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. మంగళ, బుధవారాల్లో గరుడ, హనుమంత, గజ వాహనాలపై దర్శనమిచ్చిన స్వామివారు గురువారం ఉదయం సూర్యప్రభ, సాయంత్రం చంద్రప్రభ వాహనాలపై అనుగ్రహించారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం నుంచే ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. భక్తులకు అన్ని వసతులను కల్పిస్తున్నట్లు కొత్తగా బాధ్యతలు చేపట్టిన తితిదే స్థానిక సలహా మండలి సహాయ కార్యనిర్వాహక అధికారి పార్థసారథి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒబేదారు మోహనసుందరం, సూపరింటెండెంట్ సుభద్ర తదితరులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. మోహన్‌రావు, శ్రీను, రమేశ్, ఊరా లక్ష్మీనారాయణ నిర్వహణ పనులు చేపట్టి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.



పాల్గొన్న నిర్వాహకులు



జలదిగ్బంధంలో నివాసాలు

సేలంలో కుండపోత వర్షం

సేలం: సేలం జిల్లాలో బుధవారం అర్ధరాత్రి నుంచి కుండపోత వర్షం కురిసింది. ఎడతెరపి లేకుండా కురిసిన వానతో సేలం నగరం, పరిసర ప్రాంతాలు జలమయం అయ్యాయి. శివదాపురం, పణంగాడులోని పలు వీధులు జలదిగ్బందంలో చిక్కుకున్నాయి. సెలుత్తపట్టి జలాశయం నిండటంతో మిగులు జలాలను దిగువకు విడుదల చేశారు. దీంతో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇళ్లల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం సాయం అందించాలని వాపోయారు. సేలం-ఇళంపిళ్లై రహదారిలోని కందంబట్టి సబ్‌వే నిండిపోవడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి.

పాకిస్థాన్ ఆర్మీకి ఇంటెలిజెన్స్ సమాచారం: వ్యక్తి అరెస్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: నిషేధిత ఉగ్రవాద సంస్థకు మనుషులను చేర్చడంతో పాటు పాకిస్థాన్ ఆర్మీకి ఇంటెలిజెన్స్ సమాచారం ఇస్తున్నాడని చెన్నైకి చెందిన వ్యక్తిని ఎన్ఐఏ అరెస్టు చేసింది. రాయపేటలో విద్యాకేంద్రం పేరుతో రహస్య సమావేశం నిర్వహించి ఉగ్రవాద శిక్షణ ఇచ్చిన చెన్నై అన్నాయూని వర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ హమీద్ హుస్సేన్ సహా ఆరుగురు ఇదివరకే అరెస్టయ్యారు. ప్రస్తుతం ఏడో వ్యక్తిగా ఫైజల్ రెహ్మాన్‌ను మంగళవారం అరెస్టు చేశారు. ఎన్ఐఏ అధికారులు మాట్లాడుతూ ...ఫైజల్ రెహ్మాన్ తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్ర సమన్వయకర్తగా పనిచేసి హిస్బ్ ఉత్ తహ్రీర్ సంస్థకు మనుషులను చేర్చారని, యువకులకు ఉగ్రవాద శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. భారత దేశానికి వ్యతిరేకంగా ప్రచారం చేసిన ఆయన పాకిస్థాన్ ఆర్మీకి ఇంటెలిజెన్స్ సమాచారం అందించాడన్నారు. కశ్మీర్‌ను విడిపించి అక్కడ ముస్లిం పాలన తీసుకురావడానికి పాకిస్థాన్ సైన్యం నుంచి సాయం కోరాడని చెప్పారు.

జాయింట్ కమిషనర్ల పనితీరుపై సమీక్ష

సైదాపేట, న్యూస్‌టుడే: వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్లశాఖలో పనిచేస్తున్న జాయింట్ కమిషనర్ల పనితీరుపై సమీక్ష గురువారం చెన్నై నందనంలోని శాఖ కార్యాలయంలో జరిగింది. మంత్రి మూర్తి నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో శాఖ కార్యదర్శి బ్రజేంద్ర నవనీత్, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ జగన్నాథన్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమిళనాడు వ్యాపార సంక్షేమ బోర్డు తరపున మరణించిన వ్యాపారి కుటుంబ సభ్యులైన పట్టుకోట్టైకు చెందిన సంతానలక్ష్మికి కుటుంబ సంక్షేమ నిధిగా రూ.3 లక్షల చెక్, కుంభకోణానికి చెందిన రాజశేఖర్‌కు వైద్య సాయంగా రూ.50 వేల చెక్‌ను మంత్రి అందజేశారు.



అరక్కోణం: సమావేశంలో పాల్గొన్న రాణిపేట జిల్లా కలెక్టరు చంద్రకళ, అధికారులు

ఆదిద్రావిడ, గృహవసతి శాఖ తరఫున..

సైదాపేట: తమిళనాడు ఆదిద్రావిడ హౌసింగ్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న పలు పథకాల పనుల పురోగతిపై సమీక్ష గురువారం జరిగింది. చెన్నై చేపాక్కంలోని ఆదిద్రావిడ సంక్షేమ డైరెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి శాఖ మంత్రి మదివేందన్ నేతృత్వం వహించారు. కార్పొరేషన్ ఛైర్మన్ మదివాణన్, శాఖ కార్యదర్శి లక్ష్మీప్రియ, ఎండీ కందసామి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జలాశయాల పటిష్టతపై...

అరక్కోణం: రాణిపేట జిల్లా కలెక్టరు కార్యాలయంలో కలెక్టరు చంద్రకళ నేతృత్వంలో జలాశయాల పటిష్టత, ప్రమాదాలు సంభవిస్తే ఎదుర్కొనేందుకు అవసరమైన ఏర్పాట్ల గురించి అధికారులతో గురువారం సమీక్ష జరిగింది. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారిణి మరియా పల్లవి బల్దేవ్ పాల్గొని అధికారులతో చర్చించారు. భారీ వర్షాలు సంభవిస్తే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. డీఆర్వో సురేష్, జలవనరుల శాఖ జిల్లా కార్యనిర్వాహక ఇంజినీర్ ప్రభాకర్, సహాయ ఇంజినీర్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సైదాపేట: సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి మూర్తి

ఘనంగా వేణుగోపాల విద్యాలయ వార్షికోత్సవం

టీనగర్, న్యూస్‌టుడే: చెన్నై నగరంలోని మందవెలిలో ఉన్న శ్రీవేణుగోపాల విద్యాలయ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ పాఠశాల 44వ వార్షికోత్సవ వేడుకలు గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. తేనాంపేట కామరాజర్ అరంగం వేదికగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లైఫ్ లైన్ ఆస్పత్రి వ్యవస్థాపకుడు జేఎస్ రాజ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల అధ్యక్షులు అనీల్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆనంద్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యదర్శి గోవింద్, కోశాధికారి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ముఖ్య అతిథి, నిర్వాహకులు

వర్ష సహాయక పరికరాలు సిద్ధం

తిరుత్తణి, న్యూస్‌టుడే: వర్షాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని తిరువళ్లూర్ కలెక్టరు ప్రభుశంకర్ రహదార్లశాఖ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు రహదార్ల శాఖ తిరువళ్లూర్ డివిజన్ ఇంజినీర్ సిత్రరసు పర్యవేక్షణలో తిరుత్తణి సహాయ డివిజన్ ఇంజినీర్ జ్ఞానఅరుళ్‌రాజ్ తదితరులు జిల్లాలోని పలు రహదార్లలో వర్షాల వలన ఏర్పడే సమస్యలను నియంత్రించడానికి పరికాలను సిద్ధం చేశారు.

నగల కోసం మహిళ దారుణహత్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళ గొంతు కోసి మెడలోని బంగారు నగలతో దుండగులు పారిపోయిన ఘటన తిరువారూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తిరువారూర్ మేలపరుత్తియూర్ గ్రామానికి చెందిన నారాయణస్వామి రైతు. ఇతనికి భార్య కన్నగి (48), ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలకు వివాహాలై వేరే ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇదిలా ఉండగా మంగళవారం సాయంత్రం నారాయణస్వామి పని మీద పొరుగూరు వెళ్లి రాత్రి ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో భార్య కనిపించలేదు. ఇంటి వెనుక రక్తపుమడుగులో పడి ఉండడాన్ని గుర్తించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. గొంతు కోసి మెడలోని బంగారు నగలను దుండగులు దోచుకొని వెళ్లినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐటీ ఉద్యోగిని దుర్మరణం



నిత్య (పాతచిత్రం)

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లా అరిసి పెరియం గుప్పానికి చెందిన నిత్య (26), ఈమె స్నేహితురాలు హరిణి (26) చెన్నై షోళింగనల్లూర్‌లోని ఓ ఐటీ కంపెనీలో పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై చెన్నై పల్లావరంలోని స్నేహితురాలిని కలవడానికి వెళ్లారు. అక్కడి నుంచి రాత్రి తిరుగుపయనమయ్యారు. ఆదంబాక్కం తిల్లైగంగా సబ్‌వేలో వెళ్తుండగా రోడ్డుపై ఉన్న గుంతలో వాహనం చక్రం పడటంతో అదుపుతప్పి ఇద్దరూ కిందపడ్డారు. ఆ సమయంలో వెనుక నుంచి వచ్చిన మినీ లారీ చక్రం నిత్య తలపై నుంచి వెళ్లడంతో తల నుజ్జునుజ్జయ్యి అక్కడికక్కడే మృతి చెందింది. హరిణి స్వల్పగాయాలతో బయటపడింది. ఘటనపై పరంగిమలై పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని క్రోంపేట ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం ఆమె స్వగ్రామానికి గురువారం తీసుకొచ్చారు. తల లేకపోవడంతో దేహంపై గుమ్మడికాయను ఉంచి అంతక్రియలను నిర్వహించారు.

రైలు ఢీకొని యువకుడు...



కార్తిక్ (పాతచిత్రం)

తిరుత్తణి: తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి నంది నది సమీపంలోని పద్మావతి నగర్‌కు చెందిన పాండియన్ కుమారుడు కార్తిక్ (26)కు 6 నెలల క్రితం వివాహం జరిగింది. ఇతను చెన్నైలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం విధులకు వెళ్లి రాత్రి 11 గంటలకు తిరుత్తణి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడి నుంచి ఇంటికి చేరుకోవడానికి పట్టాలు దాటుతుండగా వేగంగా వచ్చిన గూడ్సు రైలు ఢీకొంది. ప్రమాదంలో కార్తిక్ అక్కడికక్కడే మృతిచెందాడు. అరక్కోణం రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు జరుపుతున్నారు.

సరకు ఆటో బోల్తా.. 35 మందికి తీవ్రగాయాలు

శోళింగర్: పళ్లిపట్టు తాలూకా ఆర్కేపేట యూనియన్ కృష్ణాకుప్పం గ్రామానికి చెందిన మంజునాథన్ కుమార్తె శోళింగర్ సమీప జ్యోతిపురంలో నివసిస్తోంది. ఈమె కుమార్తెకు నామకరణ కార్యక్రమం గురువారం జరిగింది. ఇందుకోసం కృష్ణాకుప్పం నుంచి సరకు ఆటోలో మొత్తం 35 మంది బయలుదేరారు. శోళింగర్ సమీప ఐపేడు వద్ద వెళ్తుండగా బ్రేకులు పడకపోవడంతో అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవరు రాజశేఖర్ (30), నందకుమార్ (30) సహా మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. శోళింగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పోక్సో చట్టం కింద ఉపాధ్యాయుడి అరెస్ట్

ఆర్కేనగర్: తంజావూర్‌లోని ఓ ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలలో ముత్తుకుమరన్ (40) గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని చైల్డ్ హెల్ప్ లైన్‌కు ఫిర్యాదు అందింది. చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు 9, 10వ తరగతి విద్యార్థినుల వద్ద వేర్వేరుగా దర్యాప్తు జరిపారు. లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు అతన్ని సస్పెండ్ చేశారు. పోలీసులు బుధవారం పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు.

మారణాయుధాలు స్వాధీనం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కరూర్ తిరుమానిలైపూర్‌కు చెందిన ఇన్‌స్ట్రాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ శోభా భర్త ముఖేష్ అలియాస్ రామసుబ్రమణి. ఇతను తన భార్య స్నేహితురాలైన రమ్య బంధువులపై కక్ష సాధింపుగా కిరాయి ముఠాను రంగంలోకి దించినట్టు పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు తాంతోంద్రిమలై పోలీసులు సంబంధిత ప్రాంతంలో తనిఖీ చేపట్టి మారణాయుధాలు, రెండు తుపాకులు, 6 తూటాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముఖేష్‌తోపాటు కిరాయి ముఠాకు చెందిన ఆరుగురిని అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గురువారం పోలీసులు తెలిపారు.